కథానిక

# "కావేరి సావేరియై—"

ద్రోణంరాజు కృష్ణమోహన్

కొత్తగా కాలేజీలో ప్రవేశించిన కావేరికి అదంతా ఏదో మహాసముద్రంలా కనిపించింది. పట్టణం వదలి మహానగరం చేరుకున్నందువలనే మో వాతావరణం మరీ కొత్తగా తోచింది.

"ఊరు చూసివద్దామా?" అడిగింది రూమ్ మేట్ సరస్వతి.

"ఏమో నా కంతా కొత్త. భలే భయం!' నవ్వుతూ అన్నది కావేరి.

"ఫరవాలేదులే. ఎవరూ ఎత్తుకుపోరు" వేళాకోళంగా అన్నది సరస్వతి.

" ఛో సరూ, నీకెప్పుడూ అదే మాట" దిండు విసిరింది మీదకి.

"అవునుమరి, అందరిలోకి అందగత్తెవు. యిద్దరు బిడ్డల తల్లి అయినా."

ఆ మాట అనేసరికి కావేరికి ఒక్కసారి మళ్ళీ పిల్లలు గుర్తొచ్చారు. అమ్మదగ్గర వొదిలిపెట్టి వచ్చింది. ఆవిడకు యాభైయేళ్ళు దాటాయి. అసలే రోగిష్టి మనిషి. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, అన్నా వొదినా, వాళ్ళ చదువుల గొడవ, వాళ్ళ ఉద్యోగాల గొడవేగాని తన పిల్లలసంగతి ఎందుకు పట్టించుకుంటారు? ఆయన అకస్మాత్తుగా పోవడంతో జీవితంలో ఎంత క్లిష్టపరిస్థితి ఏర్పడింది! అయినా తను చదువుకోసమని యిలా ఎందుకు వచ్చింది? ఈ నాలుగేళ్లు పిల్లలను తరుచు చూడటానికి వీలులేక, వాళ్ళకి దూరమై, యీ కాలేజీ చదువులో మునుగుతూ, తను ఏం సంపాదించి ఎవరిని వుద్ధరిద్దామని! పిల్లల్ని తలుచుకొనేసరికి దుఃఖంవొచ్చింది. అశ్రుబిందువులు రాలాయి.

"క్షమించు కావేరీ . నీ మనస్సు బాధపెట్టానేమో!' చేతులుపుచ్చుకుంటూ అడిగింది సరస్వతి.

"ఎబ్బె, లేదు" కళ్లుతుడుచుకుంటూ అన్నది.

"రా, అలా వెళ్ళివద్దాం." ఇద్దరూ డ్రెస్ చేసుకున్నారు చక్కగా. వార్డెన్ పర్మిషన్ లభించింది. ఆదివారం. బయలుదేరారు బీచ్ కి.

"హల్లో...సరూజీ" ఎవరో పాతికేళ్ళ యువకుడు చనువుగా పలకరించాడు సరస్వతిని బీచ్ దగ్గిర.

"ఓ! కాంతారావా...రా...చాలా నాళ్ళకి దర్శనం" అంటూ కావేరిని పరిచయం చేసింది. వాళ్ళిద్దరూ మరీ చనువుగా మాట్లాడుకోవటం కావేరికి ఆశ్చర్యంతో పాటు కొంచెం అసహ్యాం కూడా కలిగించింది.

"సెకండ్ షోకి వెడదామా?" అడిగాడు.

"అమ్మో...ఇంకేమున్నా వున్నదా? వార్డెన్ పీక పిసికేస్తుంది."

"అదంతా నేను సమాధానం చెపుతాగా నీకెందుకు? లే వెళదాం. రండి మీరుకూడా" ఆహ్వానించాడు కాంతారావు.

"మీరు వెళ్ళండి. నే హాస్టల్ కెడతాను" లేచింది కావేరి.

"అదేవిటి! నన్ను విడిచి వెడతావా?" బ్రతిమిలాడింది సరస్వతి. తప్పలేదు. ముగ్గురూ సినిమాకెళ్ళారు. టిక్కెట్లు కాంతారావే కొన్నాడు. కూల్ డ్రింక్సు తెప్పించాడు. కారులో హాస్టల్ దగ్గిర దిగబెట్టాడు.

"మీతో నాకు చాలా మాటవస్తుంది కాంతారావ్ గారూ!" వార్డెన్ గట్టిగా అన్నది గదిలోకి పిలిచి.

"ఈ ఒక్కసారికి...మీకు తెలియదూ? నేను సరస్వతిని త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాను."

"అయితే యిప్పటినుంచే!" నవ్వింది వార్డెన్. కాంతారావు తండ్రి ఆవిడ క్లాస్ మేట్. బాగా పరిచయం. అందుకని అంతగా మందలించలేక పోయింది.

* * *

"మీరు మళ్ళీ ఎందుకు పెళ్ళిచేసుకోలేదు?" ఒకరోజున కావేరిని అడిగాడు బీచ్ దగ్గిర. సరస్వతి రాలేదు ఆరోజున.

"ఆ వుద్దేశం...లే...క...నే" సిగ్గుపడింది.

"పోనీ వుద్దేశం కలిగించేందుకు ప్రయత్నించారా?" ఎందుకిలా అడుగుతున్నాడో అర్థం కాలేదు. కాంతారావుని చూసినప్పటినుంచీ కావేరి మనస్సు ఆదోవిధంగా మారడం మొదలెట్టింది. రెండేళ్ళ క్రితం భర్తతో గడిపిన జీవితం, ఆహాయి, సౌఖ్యం, అన్నీ స్ఫురణకొస్తున్నాయి. కాని తను యిద్దరి పిల్లల తల్లి అయివుండగా తిరిగి వివాహం చేసుకోనేందుకు మనస్సు, హృదయం, అంగీకరించడంలేదు. మగవాడయితే నలుగురు పిల్లలున్నా, మళ్ళీ వెంటనే చేసుకోగలడు. కాని స్త్రీకి వుండే బాధ్యతలు, యిబ్బందులు, అంతపని చేయించలేవు. పైగా సంఘంలోను అసాధారణంగా కనిపిస్తుంది. ఈ అన్ని కారణాలవలన తిరిగి పెళ్ళి చేసుకోదలచలేదు. జీవితం 'వృథా చేసుకోవడ మెందుకని, ఒక డిగ్రీ పుచ్చుకుని, ఏదయినామంచి వుద్యోగం సంపాదించుకుని సుఖపడదామనుకుంది- అందుకనే కాలేజీలో చేరింది.

"ఏమో...నాకు ... అసలు యిష్టంలేదు" సమాధానం గట్టిగానే చెప్పింది. కాంతారావు నవ్వాడు.

* * *

"అమ్మా!..."పరుగెత్తుకుంటూ వచ్చి ఐదేళ్ళ కూతురు జానకి తల్లి కాళ్ళకి చుట్టేసుకుంది. పిల్లని మూడు నెలల తరువాత చూడగానే దుఃఖం వెల్లుబికి వచ్చింది కావేరికి. కౌగలించుకుంది. గట్టిగా హృదయానికి అదుముకుంది.

'తమ్ము...డే...డమ్మా"డగ్గుత్తికతో అన్నది.

"వరండాలో బండితోస్తున్నాడు" దిగి పరుగెత్తింది.

"వచ్చావా...అమ్మా...రా. బిడ్డలు నీకోసం ఒకటే కలవరింత" మంచంమీద పడుకునివున్న తల్లిమూలుగుతూఅన్నది.తల్లిప్రక్కలోకూర్చున్నది

"ఏం అమ్మా...వంట్లో బాగుండలేదా?"

ఏమిటోతల్లీ...నాలుగు రోజులనుంచి ఒకటే దగ్గు, ఆయాసం! ఆ వంటమనిషి పాపం కనిపెట్టి వున్నది. నామాట వినకుండా ఆ మహానగరం వెళ్ళి తివి చదువు చదువంటూ." నీరసంగా అన్నది తల్లి కామాక్షమ్మ.

"ఏమీ తోచక కాలేజీలో నన్నా చేరితే జీవితం సార్థకమవుతుందన్న వుద్దేశంతో చేరానే" సమర్థించుకో ప్రయత్నించింది.

"అమ్మా ఇదుగోనే తమ్ముడు" చెయ్యిపట్టుకు లాక్కొంటూ వచ్చింది జానకి. బాబు బిక్క మొహం వేశాడు తల్లిని చూసి.

భయపడి మూలగానుంచుని చూస్తున్నాడు తల్లివంక.

"ఇట్లారా...చిట్టి...తండ్రీ" వాడిని ఎత్తుకుని ముద్దాడింది. కళ్ళనీళ్ళు ప్రవహించాయి. తండ్రిలేని ఆ బిడ్డలస్థితి, మరోవైపు తన ఆశయం పూలగా కలిగిన యీ ఎడబాటుచూస్తే, ఆలోచించుకుంటే కావేరి హృదయం తరుక్కుపోయింది. ఎంతగానో ఆరాటం చెందింది.

"మరి మమ్మల్ని తీసుకెళ్ళవూ నీతో?"జానకి అడిగింది.

ఆ రాత్రి తల్లి ప్రక్కలో పడుకుని చందమామ వంక చూస్తూ,

"పిచ్చిదానా...ఎలాగమ్మా."

"నేనూ వత్తా"నంగినంగి మాటలతో అన్నాడు బాబు. మాతృ హృదయం విలపించింది. ఆ ముద్దులు మూటగట్టి బిడ్డల్ని వదిలి దూరం వెళ్ళి, వాళ్ళకి తల్లిప్రేమ, తండ్రిప్రేమ, అంటే ఏమిటో తెలియకుండా చేస్తున్న తాను కిరాతకురాలనేమో ననిపించింది.

"ఏడిచావ్, వెధవా" ముద్దు పెట్టుకుంది గట్టిగా.

"ఎప్పుడు తీసుకెడతావ్ మరి? నన్ను, తమ్ముడిని, మామయ్య హోటల్ కి తీసుకెళ్ళాడే. కొనుక్కోవడానికి అమ్మమ్మ డబ్బులు కూడా ఇవ్వదు. ఏది కొనుక్కున్నా జబ్బు చేస్తుందని అబద్ధమాడుతుంది" జానకి మాటలు ఆమెను రంపంతో కోసేసి నట్లున్నాయి. ఆ బిడ్డల ఆవేదన, గారాబు కోర్కెలు, తీర్చలేని తన జన్మ అధమాధమంగా భావించింది.

"మీకు తలలు ఎవరు దువ్వతారు రోజూ?" అడిగింది సంభాషణ మార్చి.

"ఎవ్వరూ దువ్వరే. మామయ్య, పిన్ని, అత్తయ్య అంతా కసురుకుంటారు. ఒకళ్ళకీ తీరిక

(తరువాయి 24వ పేజీలో)